క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నందిపేట్(ఆర్మూర్): వెల్మల్‌లో ఆదివారం సీసీ రోడ్డు పనులను నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా రూ.25 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు రాజేందర్, కిసాన్ కాంగ్రెస్ నాయకులు మల్లేష్, సురేష్, శ్రీధర్, వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

ముస్లిం మైనార్టీ కమిటీ అధ్యక్షుడిగా షాకతుల్ బారి



నందిపేట్(ఆర్మూర్): నందిపేట పట్టణ ముస్లిం మైనార్టీ కమిటీ నూతన అధ్యక్షుడిగా షాకతుల్ బారి, ఉపాధ్యక్షుడిగా సయ్యద్ జమీల్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మండల కేంద్రంలోని షాదీఖానాలో ముస్లిం పెద్దలు, సభ్యుల సమక్షంలో అధ్యక్ష ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బారి మాట్లాడుతూ.. ముస్లిం సమాజం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సన్మానించారు. మాజీ అధ్యక్షుడు హైమద్‌ఖాన్, కలీంబాయి జావిద్, ఆసిఫ్ బాయి, అబ్దుల్ ఘని పాల్గొన్నారు.

సాంబయ్య గుడి స్థల పరిశీలన

నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డులో గల సాంబయ్య గుడి పునర్నిర్మాణానికి ఆదివారం శ్రీ కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహారాజ్‌తో పాటు వీడీసీ సభ్యులు స్థల పరిశీలన చేశారు. ప్రతి ఒక్కరు భక్తి భావనతో కలిగి ఉండాలని మంగిరాములు మహారాజ్ ప్రవచించారు. అలాగే ఆలయ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మాక్లూర్: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం కాగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవి ప్రకాష్ లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని గొట్టిముక్కలలో పడుమటి శ్రీవల్లికి రూ. 35 వేలు, సాయిలుకు రూ.20వేల 500, మాందాపూర్‌లో తెడ్డు లక్ష్మికి రూ.18వేల చెక్కులను అందజేశారు. అలాగే చిన్నాపూర్‌లో మరో నలుగురు లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేశారు. మండల మీడియా కన్వీనర్ జైల్ సింగ్, నాయకులు పుప్పాల చిన్న, మహేష్, చింటూ, సుమన్, గంగారెడ్డి, సచ్చిన్, దారం ప్రవీణ్ పాల్గొన్నారు.

నందిపేటలో..



నందిపేట్(ఆర్మూర్): మండల కేంద్రంలోని రెండు బాధిత కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం మండల కాంగ్రెస్ నేతలు అందజేశారు. నడ్కుడ నర్సయ్యకు రూ.60 వేలు, పెద్దోళ్ల బుచ్చమ్మకు రూ.48 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసింది. స్థానిక నాయకులు మంద మహిపాల్, నిఖిల్, జమీల్, మంతెన చిన్నయ్య, ప్రభుదాస్ చేతుల మీదుగా అందజేశారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు



బోధన్: పట్టణ కేంద్రంలోని రాకాసీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో మండల విద్యాశాఖ ఏర్పాటు చేసిన విద్యార్థుల వేసవి శిక్షణ శిబిరం ఆదివారం సాయంత్రం ముగిసింది. స్థానిక డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఈ నెల 10న ప్రారంభమైన శిక్షణ శిబిరంలో కరాటే, చిత్రలేఖనం, చేతిరాత, సంగీతం, నృత్యం కళల్లో విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన సుమారు 60 మంది హాజరయ్యారు. ముగింపు కార్యక్రమంలో ఎంఈవో నాగయ్య పాల్గొని శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు.

పెర్కిట్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): పెర్కిట్ తెలుగు మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 15 రోజులుగా నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో రాజ గంగారాం బహుమతులను అందజేశారు. అలాగే శిక్షకులు ముత్యం, స్నేహలను ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఎస్‌ఎంసీ చైర్మన్ పర్వీన్ సుల్తానా, ఉపాధ్యాయులు లక్ష్మణ్, భాజన్న, గంగారాం, డి.లక్ష్మణ్ తదితరులున్నారు.

అన్నదాత 'వరి' గోస

సొసైటీ సీఈవో నిర్లక్ష్యంగా మాట్లాడారు



వడ్ల సంచులను చూపిస్తున్న రైతు పేరు తలారి రాజన్న. మారంపల్లి గ్రామం. తూకం వేసిన 180 బస్తాలు 15 రోజులుగా కళ్లాల్లోనే ఉన్నాయని, రైస్ మిల్లుకు తరలించమంటే కుద్వాన్‌పూర్ సొసైటీ సీఈవో పట్టించుకోవడం లేదని చెప్తున్నాడు. అలాగే రోడ్డుపై ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి మొలకలు వచ్చాయని, తూకం వేసి మిల్లుకు తీసుకెళ్లమంటే తనతో నిర్లక్ష్యంగా మాట్లాడినట్లు వాపోయాడు. ఇదేందని ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడుతున్నాడని, తడిసిన వడ్లను సొసైటీ కొనదని, నువ్వే ఏ మిల్లుకైనా తీసుకెళ్లు అంటూ సలహా ఇస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

పది రోజులుగా కాంటా చేస్తలేరు



మొలకలు వచ్చిన వడ్లను చూపిస్తున్న రైతు పేరు కానూరి భూమన్న. మారంపల్లి గ్రామం. కోసిన పంటను కళ్లాల్లో ఆరబెట్టి పది రోజులపైనే అవుతోంది. తేమశాతం వచ్చినా తూకం వేయలేదు. ఫలితంగా ఏడు ట్రాక్టర్ల వడ్లు వర్షానికి తడుస్తూనే ఉన్నాయి. అడుగు భాగంలో ఉన్న ధాన్యానికి మొత్తం మొలకలు వచ్చాయి. మొలకలు వచ్చిన వడ్లను వేరు చేయడం ఇబ్బందిగా మారిందని, సొసైటీ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నాడు.

- వర్షానికి కళ్లాల్లోనే మొలకెత్తిన గింజలు
- మారంపల్లి కొనుగోలు కేంద్రాన్ని గాలికొదిలేసిన వైనం
- సొసైటీ అధికారులపై మండిపడుతున్న రైతులు



మారంపల్లిలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

డొంకేశ్వర్(ఆర్మూర్): కష్టపడి పండించిన పంట కళ్ల ముందే పాడవుతుంటే రైతుల గుండె తరుక్కుపోతోంది. సారూ వడ్లను తీసుకపొండ్రి అని బ్రతిమాలినా సొసైటీ అధికారులు లెక్క చేయడం లేదు. ప్రశ్నిస్తే దిక్కున్న చోట అమ్ముకో అంటూ బెదిరిస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. డొంకేశ్వర్ మండలం మారంపల్లిలో రైతులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఇది. తొండాకూర్, దత్తాపూర్, మారంపల్లి, గంగాసముందర్ గ్రామాలు కుద్వాన్‌పూర్ సొసైటీ పరిధిలో ఉన్నాయి. మారంపల్లి కొనుగోలు కేంద్రంలో చాలా వడ్లు మిగిలాయి. కళ్లాల్లోనే కాకుండా రైతులు రోడ్లపై కూడా ధాన్యాన్ని ఆరబోశారు. తూకం వేసిన బస్తాలు లారీల్లేక కళ్లాల్లోనే ఉన్నాయి. కురుస్తున్న వర్షాలకు ఆరబోసిన ధాన్యం, తూకం వేసిన బస్తాలు తడుస్తున్నాయి. ఆరబోసిన వడ్లు వర్షానికి మళ్లీ పచ్చిగా మారుతున్నాయి. వడ్లను తరలించకపోవడంతో విత్తనాలు మొలకెత్తుతున్నాయి. మారంపల్లి కొనుగోలు కేంద్రం పరిధిలో దాదాపు రెండు లారీల బస్తాలు ఉండగా వీటిని మిల్లులకు తరలించడానికి కుద్వాన్‌పూర్ సొసైటీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



మొలకలు వచ్చిన వడ్లు

హెల్త్ సబ్‌సెంటర్ భవనం పూర్తయ్యేనా?

- ఏడాదిగా ముందుకు సాగని పనులు
- ఎలాంటి చర్యలు తీసుకోని అధికారులు



స్లాబ్ వేసి వదిలేసిన సబ్‌సెంటర్ భవనం

బాల్కొండ: మెండోరా మండలం వెల్కటూర్‌లో నిర్మిస్తున్న హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణ పనులు ఏడాది కాలంగా ముందుకు సాగడం లేదు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. గత ప్రభుత్వ హయాంలో 2022లో సబ్‌సెంటర్ భవన నిర్మాణం కోసం రూ.16 లక్షల నిధులను మంజూరు చేశారు. అదే సంవత్సరం పనులు ప్రారంభించారు. స్లాబ్ వరకు పనులు చేశారు. అంతే అటు వైపు కన్నెత్తి చూడటం లేదు. వెల్కటూర్.. మెండోరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉంటుంది. ప్రతి బుధవారం గ్రామంలో టీకాలు వేసే కార్యక్రమం నిర్వహిస్తారు. భవనం పూర్తికాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో పల్లె దవాఖానాల భవనాలు పూర్తయ్యాయి. కాని ప్రారంభానికి నోచుకోవడం లేదు. మరి కొన్ని గ్రామాల్లో పనులు అర్ధంతరంగా నిలిచి పోయాయి. ముందుకు సాగడం లేదు. అధికార యంత్రాంగం స్పందించి భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పనులు త్వరలోనే ప్రారంభిస్తామని, ఉన్నత అధికారులకు ఇది వరకే పనులు ముందుకు సాగకపోవడంపై నివేదించామని పంచాయతీరాజ్ ఏఈఈ షరీఫ్ వివరణ ఇచ్చారు.

అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై ఏది?

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి

ఆర్మూర్‌టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వానికి అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతులపై లేదని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి విమర్శించారు. ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంటలు వర్షానికి తడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా లేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి మాటలు ఎక్కువ.. చేతలు తక్కువని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా ఏదీ సరిగా అమలు చేయలేదని అన్నారు. ప్రభుత్వంలో సీనియర్ మంత్రులు ఉన్నప్పటికీ పరిపాలనలో విఫలమయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్నిరకాల ఆదుకుంటుందన్నారు. రాహుల్ గాంధీ దేశ భద్రత విషయంలో ఆర్మీ జవాన్ల పట్ల చులకనగా మాట్లాడటం సరికాదన్నారు. దీనికి ముందు మన్‌కీబాత్ కార్యక్రమంలో బీజేపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే వీక్షించారు. అలాగే బీజేపీ నాయకులు రూరల్ పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కాలనీలో వరద నీరు ఇళ్లలో చేరకుండా కల్వర్టులు నిర్మించాలని హౌసింగ్‌బోర్డు కాలనీవాసులు ..ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు.

కోతులు, కుక్కలతో ప్రజలకు తిప్పలు

- కాలనీల్లో గుంపులుగా సంచారం
- బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



చెరువు కట్ట సమీపంలో కోతుల సమూహం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలో రోజురోజుకు కోతుల బెడద అధికమవుతోంది. పలు వార్డుల్లో కోతులు గుంపులు గుంపులుగా తిరుగుతూ ఇళ్లలోకి వచ్చి ప్రజలపై దాడి చేస్తున్నాయి. ఇల్లంతా చిందర వందర చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ప్రజలు ఎన్నిసార్లు కోతుల సమస్య గురించి విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. కోతులతో పాటు కుక్కలు కూడా కాలనీలో స్వైర్య విహారం చేస్తున్నాయి. కోతుల దెబ్బకు ఇళ్ల తలుపులు ఎప్పుడూ వేసుకోవాల్సి వస్తోంది. పట్టణంలోని 36, 11, 29, 32, 33, 13వ వార్డుల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది.



33 వార్డులో కుక్కల సమూహం

కోతులను తరలించాలి

పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ప్రతిరోజు ఇంట్లో నుంచి బయటకు వచ్చే సరికి ఆరుబయట కోతుల గుంపు ఉంటోంది. ఇంటి ముందు ఊడుద్దామన్నా కోతులు దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించి కోతులను తరలించాలి.

– రాజవ్వ, 33వ వార్డు, ఆర్మూర్

దాడులు చేస్తున్నాయి

ఉదయం, సాయంత్రం కోతులు గుంపులుగా తిరుగుతూ రోడ్లపై బ్యాగులు పట్టుకుని ఎవరైనా వెళ్తుంటే వెంట పడుతున్నాయి. వెనుక నుంచి వచ్చి బ్యాగులను లాక్కెళ్తున్నాయి. ఇంట్లో సామన్లు చిందర వందరగా పడేస్తున్నాయి.

– లక్ష్మి, 32వ వార్డు, ఆర్మూర్

డబుల్‌లో నాణ్యతా లోపం

- పెచ్చులూడుతున్న స్లాబ్
- స్లాబ్‌కు పగుళ్లు..ఊగుతున్న గోడలు
- భయాందోళనలో బాల్కొండ మండల కేంద్రంలోని డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులు



పెచ్చులూడిన స్లాబ్



తేమ పట్టిన గోడలు



పగుళ్లు ఏర్పడిన స్లాబ్

బాల్కొండ: మండల కేంద్రంలో 170 డబుల్ బెడ్ రూం ఇళ్లను గత ప్రభుత్వం నిర్మించింది. అందులో 100 ఇళ్లను లబ్ధిదారులకు గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు పంపిణీ చేశారు. అప్పటి నుంచి లబ్ధిదారులు ఆ ఇళ్లలో నివాసం ఉంటున్నారు. తాజాగా వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో ఓ ఇంట్లో పెచ్చులూడి బాలికపై పడటంతో గాయాలపాలైంది. గోడలు బలహీనంగా ఉన్నట్లు స్థానికులు గుర్తించారు. స్లాబ్‌పై మొత్తం పగుళ్లు ఏర్పడుతున్నాయి. ఏడాదిన్నరకే ఇళ్ల పరిస్థితి ఇలా కావడంపై లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కింది ఇళ్లలోనే ఇలా ఉంది. పై అంతస్తు ఇళ్ల పరిస్థితి చెప్పనక్కర్లేదు. స్లాబ్‌లకు కొండీలతో ఏర్పాటు చేసుకున్న ఫ్యాన్‌లు రన్నింగ్‌లోనే కింద పడుతున్నాయని కొందరు చెబుతున్నారు. 2017 నుంచి ఆగుతూ.. సాగుతూ పూర్తయిన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం వల్లనే ఇలాంటి దుస్థితి ఉందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఉన్నత అధికారులు స్పందించి నాణ్యతా ప్రమాణాలపై తనిఖీలు చేసి లబ్ధిదారులకు భరోసా కల్పించాలని వేడుకుంటున్నారు.

గోడలు కూడా ఊగుతున్నాయి



డబుల్ బెడ్ రూం ఇళ్ల స్లాబ్ పెచ్చులూడుతున్నాయి. మా ఇంట్లో నిద్రిస్తున్న సమయంలోనే పెచ్చులూడి మా పాపపై పడింది. కూలర్‌పై పెచ్చు పడటంతో చిన్న పెచ్చు బండ మీద పడింది. లేదంటే మొత్తం మీద పడేది. గోడలు కూడ ఇలా అంటే ఊగుతున్నాయి.

– మోహన్, లబ్ధిదారుడు

నాణ్యతపై అనుమానాలు



ఇళ్లలో స్లాబ్‌కు స్టీల్ కొండీతో పై ఫ్యాన్లు బిగించుకున్నాం. స్లాబ్ గట్టిగా లేకపోవడంతో రన్నింగ్‌లోనే కింద పడుతున్నాయి. ఇలా రెండు సార్లు కింద పడింది. నిద్రిస్తున్న వేళ పడితే పరిస్థితి ఏంటి..?. నాణ్యతపై అనేక అనుమానాలు ఉన్నాయి. ఇంట్లో ఉండాలంటే భయమేస్తుంది.

– రంజిత్ కుమార్, లబ్ధిదారుడు

ఘనంగా పెద్దమ్మ బోనాలు



బోనాలు ఎత్తుకున్న మహిళలు

డొంకేశ్వర్(ఆర్మూర్): మండల కేంద్రంలో ఆదివారం పెద్దమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు సంప్రదాయ పద్ధతిలో బోనాలు ఎత్తుకోగా, యువతులు ఆడిపాడారు. నడుచుకుంటూ వెళ్లి పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. పాడి పంటలు బాగా పండాలని, పిల్లా పాపలు చల్లగా ఉండాలని మొక్కుకున్నారు.

రెంజల్(బోధన్): నీలా గ్రామంలో ఆదివారం పెద్దమ్మతల్లికి బోనాలు తీశారు. ఐదో వార్షికోత్సవం సందర్భంగా వేడుకలను నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు.

శివపార్వతుల కల్యాణ మహోత్సవం



హాజరైన భక్తులు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజారాం నగర్ కాలనీలోని శివాలయం 18వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవం కనుల పండువగా చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కొట్టూర్ ఆనంద్, ప్రధాన కార్యదర్శి అలిశెట్టి నారాయణ, కోశాధికారి గట్ల శ్రీనాథ్, ఉపాధ్యక్షుడు చెట్పల్లి రఘు, తదితరులు పాల్గొన్నారు.

సంస్థ సేవలు అందరికీ ఆదర్శనీయం



ఆర్మూర్‌టౌన్: పట్టణంలో ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అందరికి ఆదర్శమని ఆర్మూర్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జెస్సు అనిల్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని శివాజీ చౌక్ సమీపంలో గల లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో ఆదివారం స్వచ్ఛ ఆర్మూర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్థ సేవలు మరింత విస్తరించి ఆర్మూర్‌ను స్వచ్ఛ ఆర్మూర్‌గా తీర్చిదిద్దాలన్నారు. సంస్థ అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సభ్యులు ప్రకాశ్, ఆత్మచరణ్, శ్రీరామోజీ, ఆనంద్, ప్రశాంత్, నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

- **నేడు కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం**

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో మణికంఠ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఉదయం 9 గంటలకు ఉమ్మడి బాల్కొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వెంకటేశ్, ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యంరెడ్డిలు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డిలు అతిథులుగా పాల్గొంటారన్నారు.

- **జాన్కంపేట్‌లో రైతులకు విశిష్ట సంఖ్య నమోదు**

వేల్పూర్: జాన్కంపేట్‌లో సోమవారం రైతులకు 11 అంకెల విశిష్ట సంఖ్య నమోదు చేస్తామని, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకు గల ఫోన్ నంబర్‌తో గ్రామ పంచాయతి వద్దకు రావాలని ఏఈవో స్నేహశ్రీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు విశిష్ట సంఖ్య లేకపోతే పీఎం కిసాన్ తదుపరి విడత డబ్బులు రావని, తప్పని సరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

సినిమా

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-3 సింగిల్(తెలుగు)-10.45, 1.30, 7.45
మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-4.15, 10.30

స్క్రీన్-4 శుభం(తెలుగు)-10.50, 7.55
ఏస్(తెలుగు)-1.30, 10.35
హిట్(తెలుగు)-4.40

మాంసం ధరలు (రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	180
		లైవ్	140
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	97,600	వెండి(కిలో)	1,02,500
22 క్యారెట్స్	90,095		

– నిజామాబాద్ బిజినెస్

వ్యాయామం చేస్తూ ఆరోగ్యం కాపాడుకోవాలి



వేల్పూర్: వేల్పూర్‌కు చెందిన ఉపాధ్యాయుడు, హాఫ్ మారథాన్ నందిపేట చంద్రదేవ్‌ను ఆదర్శంగా తీసుకొని నడక, రన్నింగ్ వంటి వ్యాయామాలు ప్రతిరోజు చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన చంద్రదేవ్‌ను వేల్పూర్ మినీ స్టేడియంలో సన్మానించారు. చంద్రదేవ్ 5 రోజులు 5 కిలోమీటర్లు, 10 రోజులు 10 కిలోమీటర్లు, 15 రోజులు 15 కిలోమీటర్లు, 21 రోజులు 21 కిలోమీటర్లు(హాఫ్ మారథాన్)ను పట్టుదలతో పూర్తి చేయడంతో ఆయనను శాలువాతో సన్మానించారు. తీగెల మోహన్, రేగుల్ల రాములు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనాలి



తడిసిన వడ్లను పరిశీలిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

కమ్మర్‌పల్లి: ముందస్తు వర్షాలతో తడిసిపోయిన వడ్లను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం బషీరాబాద్‌లో తడిచిపోయిన వడ్లను పరిశీలించి మాట్లాడారు. ఎంపీ అర్వింద్‌తో మాట్లాడి ఆర్డీవోతో తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు బద్దం రమేష్‌రెడ్డి, నాయకులు సతీష్, సున్నం మోహన్, సోమ నరేష్, కొత్తపల్లి గణేష్, నర్ర ముత్తెన్న, శ్రీవర్ధన్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నవీపేట: మండలంలోని ఫకీరాబాద్‌లో సైబర్ నేరాలపై ఏఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గుర్తు తెలియని వ్యక్తుల ఫోన్ కాల్‌లను నమ్మొద్దని ఆయన సూచించారు. ఓటీపీ మెసేజ్‌లను ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. అనుమానిత ఫోన్ కాల్స్ గురించి పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. పోలీస్ సిబ్బంది రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.